

- ఆధునికతతో మాయమైన దశాబ్దం నాటి వెలుగులు
- జీవన పోరాటం చేస్తున్న చిందు కళాకారులు
- ఆరునెలలు రంగుల ప్రపంచం.. ఆపై ఉపాధి పోరాటం
- ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటున్న కుటుంబాలు
- అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్

7

ఆదరణ కరువై.. బతుకు బరువై..



ఇటీవల నెక్కొండలో ప్రదర్శన ఇస్తున్న చిందు కళాకారులు

సండే స్పెషల్ SUNDAY SPECIAL

మహా భారతం, రామాయణం, పాండవ వనవాసం, సతీసావిత్రి, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణార్జున యుద్ధం, శివగంగ కల్యాణం, అల్లిరాణి, బసవపురాణం, మాదలిక చరిత్ర లాంటి అనేక పురాణ, ఇతిహాసాలను నిరక్షరాస్యులకు సైతం అర్థమయ్యేలా ప్రదర్శించడం చిందు కళాకారుల నైపుణ్యానికి నిదర్శనం. ఆడుతూ.. పాడుతూ.. నవ్విస్తూ.. వీక్షకులను కనువిందు చేస్తూ చరిత్రను కళ్లకు కట్టినట్టు చూపడం వారి చతురత. తొలినాళ్లలో కాలక్షేపంగా వారు ప్రారంభించిన కళ.. వృత్తిగా మారింది. విశేష జనాదరణ పొందింది. కానీ ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి.. అంతర్జాలం అరచేతిలోకొచ్చి జీవితాలను శాసిస్తున్న నేటి రోజుల్లో ఆ చిందు కళ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. బుల్లితెర, వెండితెర ప్రపంచం అంతగా తెలియని రోజుల్లో ఎనలేని ప్రజాదరణ పొందిన చిందు కళలను నమ్ముకున్న కుటుంబాలు నేడు రోడ్డున పడుతున్నాయి. పాత తరం వారి తరహాలోనే ఇప్పుడూ ఆరునెలల పాటు అడపాదడపా ప్రదర్శనలిస్తున్నా వచ్చే సొమ్ములు రోజువారీ ఖర్చులకే సరిపోతున్నాయి. దీంతో మిగిలిన ఆరునెలలు బతుకుదెరువు కోసం కూలిపనులకు వెళుతున్నారు. ఇక వారి పిల్లలైతే ఉన్నత చదవులకు దూరమవుతూ.. చిందు కళను కొనసాగించలేక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

- నెక్కొండ, ఆంధ్రజ్యోతి

నేడు, రేపు గ్రూప్-3 పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 21 సెంటర్లు, 7,592 మంది అభ్యర్థులు
- ఉదయం 9.30 గంటలకే గేట్లు మూసివేత
- ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు



మహర్షి విద్యాలయలో గ్రూప్-3 ఇన్విజిలేటర్లకు సూచనలు ఇస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ ఉప్పలయ్య

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ద్వారా ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 7,592 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనుండగా, 21 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జామ్‌లకు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్యసిబ్బంది, తాగునీరు, విద్యుత్ సరఫరా ఉండేలా ఏర్పాట్లు చేశారు.

ఉదయం 9.30 గంటల వరకే అనుమతి..

గ్రూప్-3 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు అనుమతించనున్నారు. ఉదయం 10.00 గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. హాజరైన అభ్యర్థులంతా పరీక్ష సమయం ముగిసే వరకు హాలులోనే ఉండాలని అధికారులు సూచించారు. పరీక్ష ప్యాడ్‌లు, మొబైల్‌ఫోన్లు, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు హాల్ టికెట్‌తోపాటు ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదేని ఒక ఒరిజినల్ కార్డులను వెంటతీసుకుని రావాలని, ఎగ్జామ్ సెంటర్‌లోకి కేవలం చెప్పులతో మాత్రమే హాజరు కావాలనే నిబంధన పాటించాల్సి ఉంది. ఓఎంఆర్ షీట్‌తో పరీక్ష రాయాల్సి ఉంటుందని, దానిని నింపడానికి బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలి. ప్రతీ సెంటర్‌లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరిండెంట్లు-21 మంది, రూట్ ఆఫీసర్లు ఆరుగురు, జిల్లాస్థాయి ప్రత్యేకాధికారులు-24 మంది, ఫ్లయింగ్ స్క్వాడ్ 10 మంది, ఐడెంటిఫికేషన్ అధికారులు 86 మందిని నియమించారు. వీరితో పాటు ఇన్వీజలెటర్లు విధులు నిర్వహించనున్నారు.

రెండు రోజులు, మూడు పేపర్లు..

గ్రూపు-3 పరీక్షను మూడు పేపర్లతో పరీక్ష నిర్వహించేందుకు టీజీపీఎస్సీ అన్నిఏర్పాట్లు పూర్తి చేసింది. పేపర్-1 (జనరల్ స్టడీస్, అండ్ జనరల్ ఎబిలిటీస్) ఈ నెల 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 (హిస్టరీ అండ్ పాలిటీ అండ్ సొసైటీ) పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 18న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-3 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్) పరీక్ష ఉంటుంది. ప్రతీ పరీక్ష కేంద్రానికి నిర్ణీత పరీక్ష సమయాని కంటే 30 నిమిషాలు ముందుగానే చేరుకోవాలని, ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోని అనుమతిలేదని అధికారులు సూచించారు.

ఎగ్జామ్ సెంటర్లు ఇవే..

మహబూబాబాద్ జిల్లాలో గ్రూప్-3 పరీక్షలకు 7,592 మంది అభ్యర్థులు హాజరు కానుండగా, 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మానుకోట పట్టణంలో 13 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. అందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గెస్ట్‌హౌస్ పక్కన), ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, తక్షశిల హైస్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్వీ విద్యాలయం, మహర్షి విద్యాలయం, ఏకశిలా ఏంజిల్స్ హైస్కూల్, శ్రీచైతన్య ఈ-టెక్నో స్కూల్, గాదె రుక్మారెడ్డి మెమోరియల్ హై స్కూల్, ఫాతిమా హైస్కూల్ పరీక్ష కేంద్రాలుగా కేటాంచారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో ఆర్యభట్ట హైస్కూల్, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్, సమతా డిగ్రీ కళాశాల, సెయింట్ పాల్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

జిరాక్స్ సెంటర్లు మూసివేత..

జిల్లాలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూపు-3 పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మిగతా 8వ పేజీలో...

టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

- పరీక్షలు జరిగే స్కూళ్లు, కాలేజీ విద్యార్థులకు లోకల్ హాలీడే
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

8

19న ప్రజాపాలన విజయోత్సవ సభ

- హనుమకొండలో లక్ష మంది మహిళలతో నిర్వహణ
- సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన
- వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ మాయం.. బీజేపీకే అధికారం దక్కదు..
- నిరుపేదల జీవన, ఆర్థిక ప్రగతి కోసమే కుల సర్వే
- మీడియా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- సభ నిర్వహణపై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశం
- సభ విజయానికి దిశా, నిర్దేశం.. ఆర్ట్స్ కళాశాల మైదానం పరిశీలన



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కాంగ్రెస్ బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, అధికారులు

7

అయ్యప్ప దేవాలయానికి రూ.50 లక్షలు మంజూరు చేయిస్తా

- ఎంపీ బలరాంనాయక్ హామీ

కేసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంలోని అయ్యప్పదేవాలయ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేయిస్తానని ఎంపీ బలరాంనాయక్ హామీ ఇచ్చారు. స్థానిక ఆలయంలో 45 రోజులపాటు నిర్వహించే మండలపూజ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ మాట్లాడుతూ ఆలయంలోని పదునెట్టాంబడికి హైడ్రాలిక్ పైకప్పు కోసం రూ.25 లక్షలు, అన్నదానం కోసం షెడ్డు నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. మధ్యాహ్నం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రారంభించింది. ఆలయ కమిటీ బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేపు మానుకోటలో గ్రీవెన్స్‌సెల్ రద్దు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం జరిగే గ్రీవెన్స్‌సెల్‌ను ఈ నెల 18న రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-3 పరీక్షలు, సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే నేపథ్యంలో రేపు గ్రీవెన్స్‌సెల్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల హామీలను నిలబెట్టుకోలేని ప్రభుత్వాలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య



సీపీఎం జిల్లా మహాసభలో మాట్లాడుతున్న వీరయ్య

డోర్నకల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య విమర్శించారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో శనివారం వై.వెంకటయ్యనగర్ (బిషప్ అజరయ్య ఫంక్షన్‌హాల్లో) నిర్వహిస్తున్న సీపీఎం 3వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. రాష్ట్రంలోని బీజేపీ నాయకులు మాత్రం ఇక్కడి ప్రభుత్వాన్ని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 10ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ క్రమక్రమంగా బీజేపీకి దగ్గరవుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అమలవుతోందని, రుణమాఫీ పాక్షికంగానే చేశారని చెప్పారు. దేశంలో వామపక్ష, ప్రజాతంత్ర వాదులను ఐక్యం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి కార్యచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. తొలుత డోర్నకల్ ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బిషప్ అజరయ్య ఫంక్షన్ హాల్ వరకు సీపీఎం కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ మహాసభలో కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, నాయకులు గునిగంటి రాజన్న, శెట్టి వెంకన్న, సత్యవతి, ఆకుల రాజు, డోర్నకల్ పట్టణ కార్యదర్శి నవాబ్, మండల కార్యదర్శి ఉప్పనపల్లి శ్రీనివాస్, నాయకులు బొమ్మన అశోక్‌కుమార్, జేవీఆర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిర్చిపంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయ నిర్మల



మిర్చి పంటలో రైతులకు సలహాలు సూచనలు చేస్తున్న విజయనిర్మల

గార్ల నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న మిర్చిపంటలో యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయనిర్మల సూచించారు. శనివారం చిన్నబంజర, పుల్లూరు గ్రామాల్లోని మిర్చిపంటల్లో క్షేత్ర సందర్శన నిర్వహించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల ప్రభావం అధికం కావంతో మిర్చిపంటలపై ముడత, కందినల్లి సమస్యలు అధికం కావడంతో పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ముడత నివారణకు జిగురు పూసిన పసుపురంగు, నీలిరంగు, తెల్లరంగు అట్టాలను ఎకరాకు 30 చొప్పున అమర్చుకోవాలని, గోధుమ రంగు నీటిమచ్చలు కొమ్మలు కాండం భాగాలు కుళ్లి వళ్లిపోతాయన్నారు. దీని నివాణకు అజాక్సస్ట్రోబిన్, టేబు కోనాజోల్ అనే మిశ్రమం మందును 250 మిల్లి గ్రాములు ఎకరాకు లేదా క్లోరోతనిల్, డైఫెన్కొనాజోలు అనే మిశ్రమం మందును 400మిల్లి లేదా కాపర్ అక్సీక్లోరైడ్ మరియు ప్లాంటోమైసిన్‌ను కలిపి వారంరోజుల వ్యవధిలో తెగులు తగ్గే వరకు మార్చి మార్చి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కావటి రామారావు, ఎఈవో పూజిత, పలువురు రైతులు పాల్గొన్నారు.

రాణా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న చెత్తను సీఐ సర్వయ్య సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ కార్యాలయాల అవరణలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వారంలో ఒకరోజులో గంటపాటు పోలీస్‌స్టేషన్‌లను చెత్తాచెదారం లేకుండా సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

- ఒకరి మృతి.. ఇద్దరి పరిస్థితి విషమం



నగేష్ (ఫైల్)

ఏటూరునాగారం రూరల్, నవంబరు 16: 163వ జాతీయ రహదారిపై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో మత్స్యకారుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఏటూరునాగారం మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మండల కేంద్రంలోని ఓడవాడకు చెందిన గగ్గూరి నగేష్(45)అనే మత్స్యకారుడు ఈనెల 15వ తేదీన సాయంత్రం 4 గంటలకు చేపల కోసం గోదావరిలోకి వల వేసేందుకు వెళ్లి అక్కడ పనిపూర్తి చేసుకొని ఇంటికి తిరిగొచ్చాడు. అనంతరం మరల చేపల వేటకు అదేరోజు రాత్రి 11.30లకు తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి 163వ జాతీయ రహదారిపై గోదావరిలోకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రొయ్యూర్ పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకోగానే శంకరాజుపల్లి గ్రామానికి చెందిన హరి, సాయిల ద్విచక్ర వాహనం ముందు వెళ్తున్న వాహనాన్ని వేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గగ్గూరి నగేష్ కిందపడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక వాహనంపై వెళ్తున్న హరి, సాయిలకు గాయాలు కాగా వెంటనే మండల కేంద్రంలోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య సుమలత, కూతురు కావ్య, కుమారుడు రవితేజ ఉన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దోష నివారణ పేరుతో మోసం

- కేసులో ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

జనగామ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): దోష నివారణ పూజల పేరుతో మోసం చేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ తెలిపారు. శనివారం జనగామ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్ (హిజ్రా) బట్టు నాగదేవి జనగామకు చెందిన పాముకుంట్ల సందీప్ అనే వ్యక్తిని వివాహం చేసుకొని కొంత కాలంగా జనగామలో ఉంటోంది. బిక్షాటన చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్న నాగదేవి ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దోష నివారణ పూజలు చేసే మాంత్రికురాలి అవతారమెత్తింది. ఈ క్రమంలో జనగామకు చెందిన ఉప్పల సిరివెన్నెల అనే మహిళ ఇంట్లో దోషం ఉందనిచెప్పి, నివారణ పూజలు చేస్తానని నమ్మబలికింది. పూజల నిర్వహణకు గాను బాధితురాలి నుంచి విడతల వారీగా రూ.55లక్షల నగదు వసూలు చేసింది. ప్లాట్ డాక్యుమెంట్లను తీసుకొని మోసం చేయడంతో బాధితురాలు ఈనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. కాగా శనివారం స్థానిక నెహ్రూ పార్కు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా వారిని గుర్తించి నాగదేవి, సందీప్‌తో పాటు వారికి సహకరించిన మెతుకు గణేష్, నవీన్, భూక్యా గణేష్ అనే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.21.60 లక్షల విలువైన 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.16 వేల విలువైన 20 తులాల వెండి ఆభరణాలు, రూ.10లక్షల విలువైన ప్లాట్ డాక్యుమెంట్లు, ఒక ఎర్టిగా కారును స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంతో ప్రతిభ కనబరిచిన సీఐ దామోదర్‌రెడ్డి, సిబ్బందిని వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝా అభినందించినట్లు తెలిపారు. సమావేశంలో ఏసీపీ పార్థసారధి, పోలీసులు పాల్గొన్నారు.

కేటీకే 6వ గనిని సందర్శించిన జీఎం

కాకతీయఖని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలో కేటీకే 6వ గనిని జీఎం రాజేశ్వర్‌రెడ్డి శనివారం సందర్శించారు. బొగ్గు ఉత్పత్తి, కార్మికుల హాజరుశాతం, కార్మికులు పాటిస్తున్న రక్షణ చర్యలు వంటి విషయాలపై ఆరా తీశారు. రక్షణ చర్యలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

జీడికల్ అంటే మాకెంతో ఇష్టం

- కిలోమీటర్ వరకు మద్యం, మత్తు పదార్థాలు విక్రయించొద్దు
- ఏడాదిలోగా జీడికల్ రూపురేఖలు మార్చేస్తా..
- రూ.50 లక్షల నిధులతో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జీడికల్ గుట్టపైనున్న గుండాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం

లింగాలఘణపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జీడికల్ పుణ్యక్షేత్రం అంటే మాకెంతో నమ్మకం, ఇష్టం, మా నాయన పుట్టు వెంట్రుకలు కూడా ఇక్కడే తీశారు.. ఆలయ పవిత్రతను కాపాడేందుకు కిలోమీటర్ దూరం వరకు మద్యం, మత్తు పదార్థాల విక్రయాలు జరగొద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం సుప్రసిద్ధ జీడికల్ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభించిన కడియం బ్రహ్మోత్సవాల సందర్భంగా అధికారులు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను, ఆలయ మాడవీధులు, గుట్టపై ఉన్న గుండాలు, కల్యాణమండపంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పలు శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 2న కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సూచించిన అభివృద్ధి పనుల పురోగతిపై నివేదికను తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం 15 రోజుల్లోనే రూ.50 లక్షల నిధులు కేటాయించగా అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. జనగామ- జీడికల్ రోడ్డు, బండ్లగూడెం- జీడికల్ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు విద్యుత్‌లైన్ల ఏర్పాటు, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు, తాగునీటి, శానిటేషన్ తదితర పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టడం జరిగిందన్నారు. వచ్చే ఏడాదిలోగా గుట్టపైనున్న గుండాల వరకు మెట్ల నిర్మాణం, భక్తుల వసతిగదులు, ఆర్నెళ్లలో రూ.16కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టి జీడికల్ రూపురేఖలను పూర్తిగా మారుస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గోపీరామ్, ఈవోలు వంశీ, లక్ష్మీప్రసన్న, కెకె రాములు, డీపీఓ స్వరూప, విద్యుత్ శాఖ ఎస్ఈ వేణుమాధవ్, డీఈ లక్ష్మీనారాయణ, డీఎంహెచ్‌వో మల్లికార్జున్ రావు, ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, తహసిల్దార్ అండాలు, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, డీఈ రవీందర్, గుడి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు.

వేములవాడలో ఇనుగుర్తి డ్రైవర్ మృతి


- 'జీపు సూరయ్య'కు చివరి శ్వాస కూడా వాహనంలోనే..



వేములవాడలో జీపులో మృతి చెందిన సూరయ్య

ఇనుగుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ ఓరుగంటి సూరయ్య(62) వేములవాడలో తన వాహనంలో నిద్రిస్తూనే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం. ఇనుగుర్తి శివారు లాలుతండాకు చెందిన ఓ కుటుంబం సూరయ్యకు చెందిన వాహనాన్ని అద్దెకు తీసుకొని వేములవాడకు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. సూరయ్య భార్య భారతమ్మ శనివారం పలుమార్లు ఆయనకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో భారతమ్మ లాలు తండాకు చెందిన కుటుంబానికి సమాచారం అందించారు. ఈమేరకు సూరయ్య వాహనాన్ని వారు వెతకగా మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో పార్కింగ్ స్థలంలో గుర్తించారు. వాహనంలోనే సూరయ్య కదలకుండా ఉండడంతో స్థానికుల సహాయంలో వాహనం తలుపులను తెరిచి చూడగా ఆయన మృతి చెంది ఉన్నాడు. వాహనంలోనే నిద్రలో గుండెపోటుతో ఆయన మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఆయన భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. 40 ఏళ్లుగా జీపు నడిపించడంతో ఆయన్ను 'జీపు సూరయ్య'గా పిలుస్తారు. అలాంటి జీపు సూరయ్య తన వాహనంలోనే ఆయన చివరి శ్వాస విడవడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి



సుందరంగా అలంకరించిన స్వామి వారి మూలవిరాట్

మంగపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు హేమా చల కొండలపై వెలిసి ఉన్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రానికి శనివారం భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. వరంగల్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్టణం, కాకినాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 2వేల మంది భక్తులు తరలివచ్చారు. ముందుగా చింతామణి జలధారల వద్ద పవిత్రమైన స్నానాలు ఆచరించి జలాంజనేయ స్వామి, పంచముఖాంజనేయ స్వామి, వేణుగోపాలస్వామి, రమ సత్యనారాయణ స్వామిలను భక్తులు దర్శనాలు చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొండపై వెలిసియున్న స్వయంభు పుట్టుస్వామిగా విరాజిల్లుతున్న లక్ష్మీనర్సింహా స్వామి, పక్కనే ఉన్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలను భక్తులు పోటిపడి దర్శనాలు చేసుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు కైంకైర్యం రాఘవాచార్యులు, ముక్కమల్ల రాజశేఖరశర్మల ఆధ్వర్యంలో అర్చకులు పవన్‌కుమారాచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మలు స్వామి వారి మూలవిరాట్‌కు తిలా, తైలాభిషేకం చేసి వస్త్రాలు, గజమాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ విశిష్టత, స్వామి వారి చరిత్రను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రవణపు సత్యనారాయణ, అర్చక, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కాలసర్ప దోష పూజలు

మహదేవపూర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్య క్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో కార్తీకమాసం శనివారం పురస్కరించుకుని భక్తులు కాలసర్ప దోష పూజలు, నవగ్రహ పూజలు, లక్ష పత్రి పూజలు, లక్ష వత్తుల పూజలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే గోదావరిలో కార్తీక స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. దూర ప్రాంతాల నుండే కాకుండా ఛత్తీస్‌గడ్, మహా రాష్ట్ర నుంచి వేల కొలది భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.



కాళేశ్వరంలో కాలసర్ప దోష నివారణ పూజలు చేస్తున్న భక్తులు

న్యూస్ బాక్స్

నేడు మానుకోటలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో ఆదివారం రాష్ట్రస్థాయి షోటోఖాన్ కరాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు మానుకోట కరాటే అకాడమీ చైర్మన్ వీరునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు తెలంగాణలోని 13 జిల్లాల నుంచి 1100 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడాకారుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హాజరు కానున్నట్లు తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా షోటోఖాన్ రాష్ట్ర అధ్యక్షుడు ఊరుకొండ చంద్రశేఖర్, తెలంగాణ పోలీస్ కరాటేకోచ్ పాయం సురేష్, సీనియర్ కరాటే మాస్టర్లు కాసింషేక్, గఫూర్, బాపురావులు వ్యవహరించనున్నారని పేర్కొన్నారు.

కులగణన సిబ్బందికి పారితోషికాన్ని ప్రకటించాలి

- పారితోషికం ప్రకటించకుంటే సర్వే నిలిపివేస్తాం



మాట్లాడుతున్న సుధాకరాచారి

తొర్రూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కులగణన సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు ఇచ్చే పారితోషికాన్ని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.సుధాకరాచారి అన్నారు. శనివారంతొర్రూరులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పారితోషికం పట్ల స్పష్టమైన జీవో విడుదల చేయకుండా వ్యవహరిస్తుందని, సర్వేలో పనిచేస్తున్న వారికి పారితోషికం విషయంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. సర్వే ప్రారంభమై పది రోజులైనా పారితోషికంపై జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో సర్వే నిలిపివేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సర్వేలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల హోదాలను బట్టి పారితోషికం అందించాలని, క్షేత్ర స్థాయిలో సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఒక్కో కుటుంబానికి 40 నిముషాల సమయం కేటాయించి వ్యయ ప్రయాసలకు గురవుతున్నారని, ప్రభుత్వం సమయాన్ని పొడిగించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో చంద్రప్రకాశ్, రవి రాజు, యాకూబ్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

జనసంద్రంగా.. బుగులోని జాతర



కొండపైకి ఎక్కుతున్న భక్తులు



శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

రేగొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర శనివారం భక్త జనంతో నిండిపోయింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారికి భక్తులు ఏనుగ వాహనాలు, మేక, గుర్రం వాహనాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి విందులు చేసుకుని ఆనందంగా గడిపారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాతర కమిటీ చైర్మన్ వెంకటస్వామి, ఈవో శ్రీనివాస్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. శాసన మండలి ప్రతిపక్షనేత స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

భక్తుల అసహనం

మెట్లపై నుంచి దైవ దర్శనానికి వెళ్ళే భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. పిల్లలతో ఎక్కే భక్తులు తాగునీటికోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతరలో ఒక వైపు ఎండ మరో వైపు కొండ పైకి ఎక్కే క్రమంలో పిల్లలు దాహంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూజా సామగ్రి, ఇతర వస్తువుల అమ్మకాల్లో అడుబుఅమ్మాల్సిన కొబ్బరికాయ రూ.30 నుంచి 40లకు అమ్మడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీఐపీ భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్ వల్ల సాధారణ దర్శనం చేసుకునే భక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎడ్ల బండి బోల్తాపడడంతో ఓ భక్తురాలికి గాయాలయ్యాయి. అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు.

భక్తుల సౌకర్యార్థం వసతి షెడ్లు

- మేడారంలో డీపీవో దేవరాజ్

మేడారం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వనదేవతలను దర్శించుకునేందుకు తరలి వచ్చే భక్తుల వసతి షెడ్లను జిల్లా పంచాయితీరాజ్ అధికారి దేవరాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మా ట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం 5 వసతి షెడ్లలో 15మంది ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని పనిలోకి తీసుకోవడం జరిగిందన్నారు. మహా జాతర అనంతరం నాలుగు నెలలుగా జీతాలు చెల్లింపు కాకపోవడంతో పనులు బంద్ చేసిన సిబ్బందిని పూర్తి జీతాలను చెల్లించి పనిలోకి తీసుకోవడం జరిగిందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం మేడారం పరిసరాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యదర్శి సతీష్‌తో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



మేడారంలో భక్తుల వసతి షెడ్లను పరిశీలిస్తున్న డీపీవో దేవరాజ్

అట్టహాసంగా ఈషా గ్రామీణ క్రీడోత్సవాలు



మినీ స్టేడియంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

జనగామ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో 16వ గ్రామీణోత్సవ క్రీడోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఏసీపీ పార్థసారధి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతలో క్రీడాశక్తిని వెలికితీసేందుకే ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడోత్సవాలలో తొలి రోజు వాలీబాల్ క్రీడలను నిర్వహించగా జిల్లాలోని మొత్తం 12 మండలాల నుంచి 25 టీములు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి వెంకట్‌రెడ్డి, సీఐ దామోదర్‌రెడ్డి, ఈషా ఫౌండేషన్ సభ్యులు జలజ, జ్యోతి, రవిచందర్, శ్రీప్రియ అనిల్ రోహిత్, వ్యాయామ ఉపాధ్యాయులు గోర్‌సింగ్, గంగిశెట్టి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ కరువై.. బతుకు బరువై..

- ఆధునికతతో మాయమైన దశాబ్దం నాటి వెలుగులు
- జీవన పోరాటం చేస్తున్న చిందు కళాకారులు
- ఆరునెలలు రంగుల ప్రపంచం.. ఆపైఉపాధి పోరాటం
- ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటున్న కుటుంబాలు
- అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్



నాటక ప్రదర్శన ఇస్తున్న కళాకారులు (ఫైల్)

నెక్కొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆడుతూ.. పాడుతూ.. నవ్విస్తూ.. ప్రేక్షకులను కనువిందు చేస్తూ.. చరిత్రను కళ్లకు కట్టినట్టు చూపుతారు చిందు కళాకారులు. ఒకప్పుడు కాలక్షేపంగా ప్రారంభమైన ఈ కళ.. రానురాను వారి వృత్తిగా మారింది. కానీ ఆ కళ నేటి అధునిక ప్రపంచంలో ప్రజాదరణ కరువై కళ తప్పుతోంది. చిందు కళాకారులు ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటూ జీవనపోరాటం చేస్తున్నారు. సినిమా ప్రపంచం అంతగా తెలియని రోజుల్లో ఎనలేని ప్రజాదరణ పొందిన చిందు కళలను నమ్ముకున్న కళాకారుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పాత తరం వారి తరహాలోనే ఇప్పుడూ ఆరునెలల పాటు అడపాదడపా ప్రదర్శనలిస్తున్నా వచ్చే సొమ్ములు రోజువారీ ఖర్చులకే సరిపోతున్నాయి. దీంతో మిగిలిన ఆరునెలలు బతుకు దెరువు కోసం కూలిపనులకు వెళుతున్నారు. ఇక వారి పిల్లలైతే అటు ఉన్నత చదవులకు దూరమవుతూ.. చిందు కళను కొనసాగించే పరిస్థితి కానరాక అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దశాబ్ద కాలం క్రితం ఎక్కువగా దళిత కాలనీల్లో.. ప్రదర్శనలిచ్చిన చిందు కళాకారుల శ్రమను గుర్తించిన దళితులు వారిని ప్రోత్సహించడంతో వారిని ఆహ్లాదపర్చడమే లక్ష్యంగా చిందు కళాకారులు కూడా నాటక రంగానికి శ్రీకారం చుట్టారు. తొలిరోజుల్లో కాలక్షేపానికి ప్రదర్శనలు ఇచ్చిన చిందుకళాకారులు, రానురాను దీనినే వృత్తిగా ఎంచుకుని తమ కళకు పదును పెట్టారు.

మహా భారతం, రామాయణం, పాండవ వనవాసం, సతీ సావిత్రి, భక్త ప్రహ్లాద, శ్రీకృష్ణార్జునయుద్ధం, శివగంగ కల్యాణం, అల్లిరాణి, భసవపురాణం, మాడలిక చరిత్ర లాంటి అనేక పురాణ, ఇతిహాసాలను నిరక్షరాస్యులకు కూడా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించే వారు. ఈ ప్రదర్శన సమయంలో అప్పటి ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన చిందు కళాకారులు ఇతిహాసాలకు సంబంధించిన పరదాలను నాటకాల సమయంలో స్టేజీలకు వెనుక వైపున మార్చుతూ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేవారు. అయితే కొంత కాలం తరువాత చిందుకళాకారుల కళలకు ఆకర్షితులైన దళితులతో పాటు ఇతర కులాల ప్రజలు కూడా గ్రామాల్లో ప్రదర్శనలు ఇవ్వాల్సిందిగా కోరేవారు. ఇందుకోసం వారికి ఆర్థిక సాయం చేయడంతో ఆ రోజుల్లో చిందు కళలు ఎంతో ఆదరణ పొందాయి. కేవలం ఆరు నెలల పాటు ప్రదర్శనలిస్తే.. ఏడాదంతా వారి కుటుంబాలకు సాఫీగా జీవనం సాగించేవి.

మూడేళ్లకోసారి ప్రదర్శనలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నెక్కొండ, కేసముద్రం, గూడూరు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన దాదాపు 20 కుటుంబాలు చిందు కళా ప్రదర్శనలు ఇస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా వరంగల్, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో ప్రదర్శనలు ఇస్తుంటారు. వారంతా రోటేషన్ పద్ధతిన మూడు సంవత్సరాలకు ఒకసారి ఆయా జిల్లాలకు వెళ్లి ప్రదర్శనలు ఇవ్వడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ప్రతీ సంవత్సరం జనవరి నుంచి జూన్ వరకు చిందుకళాప్రదర్శనలు ఇస్తుంటారు. ఇందుకుగాను ప్రదర్శనలు ఇచ్చిన దళిత కాలనీల్లో కులాల పాలుగా రూ.15వేల నుంచి రూ.20 వేలు ఇచ్చేవారు. ఇదే సమయంలో గ్రామస్థుల కోరిక మేరకు గ్రామాల్లో కూడా ప్రదర్శలు ఇవ్వడంతో ఆర్థికంగా గిట్టుబాటయ్యేది. కానీ, నేడు ఆదరణ తగ్గడంతో వారి జీవనోపాధికి గాను కేవలం దళిత కాలనీల్లోనే మొక్కుబడిగా ప్రదర్శనలు ఇస్తున్నారు.



నెక్కొండలో ప్రదర్శన ఇచ్చిన చిందుకళాకారుల బృందం(ఫైల్)

సండే స్పెషల్ SUNDAY SPECIAL

భారంగా ఆయుధాలు, పరదాల ఏర్పాటు

చిందుకళాకారులు వారి జీవనోపాధి కోసం ఇస్తున్న ప్రదర్శనలు వారిని ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నాటకాలకు సంబంధించిన ఆయుధాల బొమ్మల తయారీకి, కళాకారుల మేకప్, నాటకల ప్రదర్శన సమయంలో ప్రదర్శించే బొమ్మల పరదాలు, వాయిద్యాల ఏర్పాటు చిందుకళాకారులకు భారంగా మారుతున్నాయి. దీనికి తోడు రవాణా ఖర్చులు కూడా పెరగడంతో కళాకారులందరినీ అన్ని జిల్లాలకు తీసుకుపోవడం కష్టంగా మారింది.

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం
గడ్డం వెంకటనర్సు, కళాకారుల బృందం అధ్యక్షుడు



వంశపారంపర్యంగా వస్తున్న చిందుకళను నమ్ముకున్న మా కుంటుంబాలు ప్రదర్శనలు ఇచ్చినా, ఆదరించే వారు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని కుటుంబాలైతే పస్తులుండాల్సిన పరిస్థితి. ఏడాదిలో ఆరు నెలలు ప్రదర్శలు ఇవ్వగా వచ్చే ఆదాయం ఏ రోజుకారోజు పోషణకే సరిపోతుంది. మిగతా ఆరు నెలలు కూలీ పనులను వెతుకోకతప్పడంలేదు. ప్రదర్శనలను ఇవ్వడానికి ఊరూర తిరగడంతో మా పిల్లలు కూడా పెద్ద చదువులు చదువుకోలేదు. అటు ఉన్నతవిద్యకు దూరమై.. ఇటు ఆదరణకు నోచుకోక చిందు కళాకారుల పిల్లలు భవిష్యత్‌లో రాణించలేకపోతున్నారు.

ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
గడ్డం మొగిళి, కళాకారుడు (మహిళా వేషధారణ)



ఆర్థిక ఇబ్బందుల కారణంగా మా పిల్లలు చిందుకళకు దూరంగా ఉంటున్నారు. దీంతో ఈ కళ మా తరం వారతోనే అంతరించిపోయే ప్రమాదం ఉంది. చిందు కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఆర్థిక సాయం, ప్రోత్సాహాన్ని అందిస్తే కళ బతుకుతుంది. ఉపాధికోల్పోతున్న కులాలను గుర్తించి వారి ఆర్థికా భివృద్ధికి ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తున్న తరహాలోనే చిందు కళాకారుల ఆర్థికాభివృద్ధికి ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

దక్ష రెడ్డికి బాలకళారత్న అవార్డు



హనుమకొండ కల్చరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రొండ్ల దక్ష రెడ్డికి పన్నెండవ కూచిపూడి ఒలింపియాడ్-2024లో ప్రతిష్ఠాత్మక బాల కళారత్న అవార్డు లభించింది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు గుంటూరులో జరిగిన ఈ కూచిపూడి ఒలంపియాడ్‌లో దక్ష రెడ్డి ఈ అవార్డుకు ఎంపియ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ విభాగాల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ఈపోటీల్లో సీనియర్ విభాగంలో హనుమకొండలోని కనకదుర్గ కాలనీకి చెందిన దీక్ష రెడ్డి ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. అలాగే హనుమకొండకు చెందిన శరణ్య, ప్రియ, సబ్ జూనియర్స్ నుంచి వేదాంశి తమ అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. బహుమతులు సాధించారు. దక్షరెడ్డిని ప్రతిభకు గుర్తింపుగా బాలకళారత్న అవార్డుతో సత్కరించారు. శరణ్య, ప్రియ, వేదంశిలు కూడా ప్రథమ బహుమతులను, అవార్డులను అందుకున్నారు. ప్రముఖ కూచిపూడి నృత్యగురువు బొంపెల్లి సుదీర్‌రావు శిష్యరికంలో వీరంతా ఈ అవార్డులను సాధించారు.

సుమతిరెడ్డిలో అవిజ్ఞాన్ 3.0 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలో ప్రతిఏటా ట్రిపుల్‌ఈ స్టూడెంట్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ లెవల్ టెక్నో కల్చర్ ప్రోగ్రాం అభిజ్ఞాన్ 3.0 వాల్ పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి శనివారం ప్రోగ్రాం కోఆర్డినేటర్, స్టూడెంట్ బ్రాంచి అడ్వైజర్ మూల రాముతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకే ప్రతీ సంవత్సరం ట్రిపుల్‌ఈ స్టూడెంట్ బ్రాంచి ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ కె.మహెందర్, ఏవో వేణుగోపాలస్వామితో పాటు విద్యార్థి కోఆర్డినేటర్లు వనపర్తి సహస్ర, వస్త్రాల నందిని, వర్షిత, సౌమిక, సద, స్నేహ, శ్రీజ, చితుర్వ, కమలాక్షిత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతంటే ప్రాణం

- పర్యావరణ పరిరక్షణలో దైద వెంకన్న
- చిన్నతనం నుంచే పలు కార్యక్రమాలు
- 'ఫోన్ కొట్టు.. మొక్క పట్టు'తో ప్రత్యేకత
- పదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 16లక్షల మొక్కల పంపిణీ





మహబూబాబాద్‌లో వనజీవి రామయ్యతో కలిసి మొక్క నాటుతున్న దైద వెంకన్న (ఫైల్)

• ఆదర్శం

మహబూబాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మొక్కలంటే ఆయనకు అమిత ప్రేమ... ఖాళీ జాగ కన్పిస్తే చాలు మొక్కలు నాటడం.. వాటిని పరిరక్షించడం అలవాటుగా మార్చుకున్నారు. అలా స్వయంగా నాటి, బతికించిన మొక్కలెన్నో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్క మానుకోటలోనే కాదు..రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, హైదరాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, కరీంగనర్ జిల్లాల్లో పర్యావరణ పరిరక్షణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే పదేళ్లలో సుమారు 16లక్షల మొక్కలను పంపిణీ చేసి ప్రకృతి తపస్విగా, వన ప్రేమికుడుగా గుర్తింపు పొందాడు మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన దైదవెంకన్న. ప్రజా హృదయం స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి ఓ వైపు సామాజిక సేవ చేస్తూనే మరో వైపు పర్యావరణ పరిరక్షణపై దృష్టిసారించారు. మునిసిపల్ జీవ వైవిధ్య కమిటీ సభ్యులుగా తనవంతు కృషి చేస్తున్నారు. మహబూబాబాద్ జల్లా కేంద్రం సమీపంలోని వేమూనూరు శివారు ఉత్తర తండాను దత్తత తీసుకుని అక్కడ ఐదు వేల మొక్కలు నాటారు. 2018లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా హరితమిత్ర అవార్డుతో మరి కొన్ని అవార్డులు సొంతం చేసుకున్నారు. 2020 సంవత్సరంలో గవర్నర్ రంగరాజన్, అటవీ శాఖ మంత్రి జోగు రామన్న చేతుల మీదుగా దైద వెంకన్న ఆ అవార్డును అందుకున్నారు.

గురువుల స్ఫూర్తితో చిన్నతనం నుంచే..

మహబూబాబాద్ పట్టణానికి చెందిన దైద వెంకన్న ఇందిరానగర్ పాఠశాలలో చదివారు. 1985లో తాను చదువుకునే రోజుల్లో ఆయన గురువులు కృష్ణమూర్తి,షబ్బీర్ విద్యార్థులు మొక్కలు నాటాలని సూచిస్తూ ప్రతీవిద్యార్థికి ఐదు మొక్కలను పంపిణీ చేశా రు. ఆ సమయంలో వెంకన్న నాలుగు జామాయిలు, ఒక చింతచెట్టును నాటి వాటిని సంరక్షించి పెద్దవి చేశాడు. ఇటీవలే తానుపెంచిన చెట్లకు వందనం చేస్తూ నాటి మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అలా పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి పెంచుకున్న వెంకన్న విద్యార్థులు, ప్రముఖుల జన్మదినోత్సవం, వివాహాది శుభకార్యాలకు మొక్కను బహూకరించి నాటిస్తారు. ఆరేళ్లుగా రాఖీ పౌర్ణమి పర్వదినాన వృక్షాబంధన్‌ను నిర్వహించి మొక్కలకు రాఖీలు కట్టిస్తారు.

'ఫోన్ కొట్టు మొక్క పట్టు'తో ఇళ్ల వద్దకే మొక్కలు..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014 నుంచి వెంకన్న మొక్కవోని దీక్షతో పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారు. ఎవరైనా మొక్కలు కావాలని ఫోన్ చేస్తే ఎంత దూరమైనా సొంత ఖర్చులతో తన ఆటోలో మొక్కలను తీసుకెళ్లి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం తన ఇంటివద్ద అన్ని రకాల మొక్కలను అందుబాటులో పెట్టుకుంటున్నారు. ఆయనే కాదు.. కుటుంబ సభ్యులు కూడా మొక్కలను నాటడడంలో భాగస్వాములవుతారు. 2016, 17 సంవత్సరాల్లో ఉదయాన్నే లేచి మహబూబాబాద్ పట్టణంలో 180 రోజుల పాటు డప్పుచాటింపు ద్వారా మొక్కల పెంపకం.. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మొక్కలు పంపిణీ చేశారు. ఇటీవల రాష్ట్ర స్థాయి వన ప్రేమికులను మానుకోటకు ఆహ్వానించి సదస్సును ఏర్పాటు చేసి వారి సేవలను శ్లాఘిస్తూ అవార్డులను అందించారు.



2014లో ప్రధాని స్వచ్ఛ భారత్ పిలుపుతో...

ప్రధాని నరేంద్రమోదీ 2014లో స్వచ్ఛభారత్ పిలుపుతో మహబూబాబాద్ పట్టణంలో వన ప్రేమికుడు దైద వెంకన్న 45 రోజుల పాటు పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములై కరపత్రాల ద్వారా చైతన్యం నింపారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. 2018లో మన్‌కి బాత్‌లో భాగంగా మట్టితో ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల మన్‌కి బాత్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరిట లక్ష మొక్కలు నాటాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఈక్రమంలో పట్టణంలోని నర్సింగ్ కళాశాలలో ఒక్క రోజే విద్యార్థులతో వంద మొక్కలు నాటించారు. మానసిక దివ్యాంగులతో కూడా మొక్కలు నాటించారు. హరిత తెలంగాణే లక్ష్యంగా తీసుకువచ్చిన హరితహారంలో తన వంతు బాధ్యతగా వేలాది మొక్కలు నాటుతూ ఇతరులకు మొక్కలను పంపిణీ చేస్తూ దైద వెంకన్న అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంచుకోవాలి


- సదస్సులు, సంగోష్ఠులతోనే అవకాశం
- నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధీ
- నిట్‌లో ప్రారంభమైన రెండు రోజుల సింపోజియం




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధీ

హనుమకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణల పట్ల పూర్తిస్థాయి అవగాహనను పెంచుకోవడానికి సదస్సులు, సంగోష్ఠులు, వర్క్‌షాపులు ఎంతో దోహదపడతాయని వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధీ అన్నారు. శనివారం వరంగల్ నిట్, ఇండియన్ నేషనల్ ఆకాడెమీ ఆఫ్ ఇంజనీరింగ్ (ఐఎన్‌ఏఈ) ఆధ్వర్యంలో 18వ నేషనల్ ఫ్రాంటియర్స్ ఆఫ్ ఇంజనీరింగ్ సింపోజియం జరిగింది. నిట్ క్యాంపస్ లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ప్రారంభమైన ఈ రెండు రోజుల సంగోష్ఠిని డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి, ఐఎన్‌ఏఈ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ శివాజీ చక్రవర్తి, ఎన్ఐటీ వరంగల్ డీన్ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్)) ప్రొఫెసర్ శిరీష్ సోనావానే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సుబుధీ మాట్లాడుతూ.. నూతన సాంకేతిక ప్రక్రియల సమాచారం ఆదానం ప్రదానం జరిగినప్పుడే రాణించడానికి వీలుకలుగుతుందన్నారు. నిట్‌లో నిర్వహిస్తున్న ఈ సింపోజియం తాజా పరిశోధనలను పంచుకునేందుకు ఎంతో దోహద పడుతుందన్నారు. రెండు రోజు ఈ సదస్సులో సంకలిత తయారీ, ఆటోమేషన్, స్మార్ట్ గ్రిడ్, పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్లు, కంట్రోల్ అండ్ ప్రొటెక్షన్, గ్రీన్ హైడ్రోజన్, స్టోరేజీ టెక్నాలజీ, క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, మెషిన్ అనే నాలుగు థీమ్‌లలో ప్లీనరీ, కీనోట్ సెషన్లను నిర్వహిస్తారు. ఐఎన్‌ఏఈ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ శివాజీ చక్రవర్తి ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ పరిశోధనా రంగంలో సాగిస్తున్న కృషి, సాధించిన విజయాల గురించి వివరించారు. ప్రొఫెసర్ ఇంద్రనీల్ మన్నా వర్చువల్‌గా తన సందేశాన్ని పంపారు. డీన్ ఆర్ అండ్ డీన్ ప్రొఫెసర్ శిరీష్ సోనవానే సింపోజియమ్‌వల్ల వినూత్న ఆవిష్కరణల ఆకళింపునకు వీలు కలుగుతుందన్నారు. వివిధ ఇంజనీరింగ్ సంస్థలకు చెందిన 70 మంది అధ్యాపకులు పరిశోధకులు ఈ సంగోష్ఠికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 28 పోస్టర్లను, తయారీ పద్ధతుల్లో ఆవిష్కరణలు ప్రదర్శిస్తారు. ఉత్తమ ఆవిష్కరణలకు రూ.40వేలు, రూ.20వేలు నగదు బహుమతులన అందచేస్తారు.





ఫొటోలు 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

ప్రకృతి గీసిన ముఖచిత్రం
భద్రకాళి గుట్టపై ఆవిష్కృతం

సూర్యోదయ సమయాన.. పసిడి వర్ణంలో ఉదయించిన భానుడి లేలేత కిరణాలు మంచుతెరలను చీల్చుతూ.. ఆకాశమే హద్దుగా నిలిచిన ఆ రాతి గుట్టలను తాకిన వేళ... మనిషి ముఖాన్ని పోలిన ఆకారం ఆవిష్కృతమైంది. పర్యావరణ ప్రేమికులను అమితంగా ఆకట్టుకున్న ప్రకృతి గీసిన ఈ 'ముఖ'చిత్రం శనివారం తెల్లవారుజామున వరంగల్ భద్రకాళి దేవస్థాన ప్రాంగణంలోని భద్రమ్మ గుట్టలపై కనిపించింది. తిరుమల కొండలపై వేంకటేశుని రూపం మాదిరిగానే ఇక్కడ ముఖరూపం కనిపిస్తోంది.

19న ప్రజాపాలన విజయోత్సవ సభ

- హనుమకొండలో లక్షకుపైగా మహిళలతో నిర్వహణ
- మీడియా సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్
- సభ నిర్వహణపై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో సమావేశం
- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాట్ల పరిశీలన



ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

హనుమకొండ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వ ఏడాది ప్రజాపాలన సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 19న హనుమకొండలో విజయోత్సవ సభను నిర్వహించనున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. మంగళవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే విజయోత్సవ సభ ఏర్పాట్ల పరిశీలనకు గాను ఆయన శనివారం హనుమకొండ వచ్చారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ప్రజాపాలన విజయోత్సవ సభ విజయవంతానికి ప్రతీ ఒక్కరు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఒక్కో నియోజకవర్గం వారిగా సభకు తరలించే బాధ్యతలను ఎమ్మెల్యేలు చూసుకోవాలన్నారు. ఆ మేరకు బాధ్యతల విభజన జరగాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజాపాలన విజయోత్సవ సభ చరిత్రలో నిలిచేలా ఉండాలని లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఒక్కో నియోజకవర్గం వారిగా ప్రధాన సమస్యలు, ఆ సభలో ముఖ్యమంత్రి ద్వారా వెల్లడింపచేసే అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుల వివరాలను కూడా మహేశ్‌కుమార్‌గౌడ్ చర్చించారు. వరంగల్ నగరంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, కాళోజీ కళాక్షేత్రం, నయీంనగర్ బ్రిడ్జి ప్రారంభం ఇతర పనుల వివరాలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. 19న లక్షకుపైగా మహిళలతో నిర్వహించబోయే సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని, ఏడాదిలో కాంగ్రెస్ సర్కారు చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాల వివరాలతో పాటు భవిష్యత్‌లో చేపట్టబోయే చర్యలను వెల్లడిస్తామన్నారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మాయం కానుందని, ప్రజలు ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కల్పిస్తే దానిని అగౌరవపరిచారని, కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితం కావడమే ఇందుకు నిదర్శనమన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని, సోషల్ మీడియాతో నిజాలను వక్రీకరిస్తూ ప్రజలను నమ్మించే కుట్రలు చేస్తున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మతం పేరిట అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని, ఆ పార్టీ శ్రమ ఎప్పటికీ వృథాయే అవుతుందన్నారు. హైదరాబాద్ భవిష్యత్ కోసం మూసీ ప్రక్షాళన చేస్తుంటే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకునే చర్యలకు పాల్పడుతున్నారని, బీజేపీ మూసీ నిద్రతో ఒరిగేదేమీ లేదని మండిపడ్డారు. నిరుపేదల జీవన, ఆర్థిక ప్రగతి కోసమే రాష్ట్రంలో కుల సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. పార్టీలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని కొట్టి పారేశారు.

సభా మైదానం పరిశీలన

నేతలు, విలేకరులతో సమావేశం అనంతరం మహేశ్ కుమార్‌గౌడ్ సభ నిర్వహించనున్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. వేదిక ఏర్పాటు, గ్యాలరీలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాలను చర్చించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద తదితర అధికారులతో ఏర్పాట్లు, బందోబస్తు గురించి చర్చించారు. సభ వాస్తు ప్రకారంగా జరిగేలా ఏర్పాట్లు ఉండాలనే అభిప్రాయాలను నేతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, మురళీనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఈవీ శ్రీనివాస్‌తో పాటు ఉమ్మడి వరంగల్‌లోని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సభ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, మంత్రులు

ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సమావేశమైన పీసీసీ చీఫ్

ఆర్ట్స్ కళాశాల మైదానం పరిశీలన అనంతరం హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మరోసారి మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబులతో కలిసి ఒక్కో ఎమ్మెల్యేతో విడివిడిగా సభ నిర్వహణ అంశాలను చర్చించారు. నియోజకవర్గం వారీగా సభకు తరలించేందుకు జనం, వాహనాల సమీకరణ, సభ నిర్వహణలో నిర్వర్తించాల్సిన బాధ్యతలు, తదితరఅంశాలపై చర్చించారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, రాంచంద్రునాయక్‌తో పాటు పలువురు ముఖ్య నేతలతో టీపీసీసీ అధ్యక్షుడు వేర్వేరుగా భేటీ అయ్యారు.

ఈజీఎస్ అవకతవకలపై చర్యలేవి?!

- జిల్లాలో రూ.21.80 లక్షల పెండింగ్ జరిమానాలు
- రికవరీలపై ఉన్నతాధికారులు మీనమేశాలు
- దీర్ఘకాలికంగా ఒకేచోట టీఏలు, ఈసీలు

తొర్రూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్)లో జరిగిన అవకతవకలపై జిల్లా ఉన్నతాధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తు న్నారు. అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో, రికవరి చేయడంతో మీనమేషాలు లెక్కిస్తున్నారు. గ్రామాల్లోని పేదలకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో 2006లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ప్రారంభించారు. ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాలను అభివృద్ధి చేసే విధంగా నిధులు కేటాయిస్తుంటారు. ఈ పనుల్లో అవకతవకలు చోటు చేసుకోకుండా ప్రతీ ఆర్థిక సంవత్సరానికి ఒక్కసారి సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటారు. 2021-2022, 2022-2023 సంవత్సరాల్లో జరిగిన పనుల్లో రూ.21 లక్షల 80వేలకుపైగా అవకతవకల పెండింగ్‌లు ఉన్నాయి.

మహబూబాబాద్ జిల్లాలో కొన్ని మండలాల్లో 2022-23 సంవత్సరం వరకు కేంద్ర ఆడిట్ బృందం 14వ సామాజిక తనిఖీలో ఓపెన్ ఫోరం చేపట్టారు. ఆడిట్ బృందం 2021-22 సంవత్సరానికి గాను జిల్లాలోని 18 మండలాలకు ఏడు మండలాల్లో రూ.21, 80,575 అవకతవకలు జరిగినట్లు ఆడిట్ బృందం గుర్తించి, నివేదించారు. అందులో నుంచి ఇప్పటి వరకు రూ.7,64,022 రికవరీ చేయగా, రూ.14,16,583 పెండింగ్‌లో ఉన్నాయి. అయితే అధికంగా ఈజీఎస్ టీఏ, ఈసీలు ఆర్థిక దుర్వినియోగానికి పాల్పడినట్లు బృందం నివేదించి, రెండేళ్లు గడుస్తున్నా కనీసం వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా లేవు.


ఎంపీడీవో ఆఫీలో ఓపెన్ ఫోరంలో ఈజీఎస్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఆర్డీఏ అధికారులు (ఫైల్)

మండల వివరాలు	రికవరీ చేయాల్సినవి	రికవరీ చేసింది	పెండింగ్ ఉన్నవి
కేసముద్రం	రూ.596835	138542	458293
కురవి	రూ.321714	206072	115642
చిన్నగూడూరు	రూ.112254	5932	76322
పెద్దవంగర	రూ.86541	55683	30858
నెల్లికుదురు	రూ.493909	191002	302907
మరిపెడ	రూ.298228	55774	242484
గార్ల	రూ.271094	81017	190077
మొత్తం	రూ.21,80,575	7,64,022	14,16,583

తొర్రూరు మండలంలో 14వ సామాజిక తనిఖీలో జరిగిన అవకతవకల సమాచారం కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో పలు అనుమాలకు దారి తీస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో జరిగిన అవినీతి అక్రమాల పెండింగ్ అధికారులు వెల్లడి స్తే భారీ ఎత్తున బయటపడే అవకాశాలు ఉన్నాయి. నామమాత్రంగా పెండింగ్ సమాచారాలను అందజేసి, అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ఆడిట్ బృందం గుర్తించిన అవకతవకలు..

ఉపాధిహామీ పథకంలో భాగంగా 2021-2022, 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 13వ, 14వ సామాజిక తనిఖీలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆడిట్ బృందం గుర్తించింది. అందులో కొన్ని తొర్రూరు మండలం వెల్లికట్టెలో 2022-23లో రూ.79,219 ఆర్థిక దుర్వినియోగం జరిగినట్లు గుర్తించగా, అందులో క్రీడాప్రాంగణంలో మెటిరియల్ టాస్క్, మొక్కలు నాటకుండానే రూ.59, 516 బిల్లులు చెల్లించినట్లు గుర్తించారు. 2021-22 ఆర్థిక సంవత్సరం ఆడిట్‌లో బోజ్యాతండాలో రూ.1,29,296 అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించగా, 2700 మొక్కలు ట్యాంకర్ పేమెంట్ కింద రూ.1,01,520 ఖర్చు చేసినట్లు టీఏ, ఈసీ ఎంబీ బిల్లు చేయగా, పంచాయతీ కార్యదర్శి ట్యాంకర్‌తో నీళ్ల పోయలేదని, జీపీ బోరుద్వారా నీళ్ల పోసినట్లు ఆడిట్‌బృందానికి వివరణ ఇచ్చారు. చెర్లపాలెంలో రూ.63,856 ఆర్థిక దుర్వినియోగం జరిగినట్లు గుర్తించగా బీసీ హాస్టల్‌లో 300 మొక్కలు నాటకుండానే నాటినట్లుగా రూ.27,540 ఎంబీ రికార్డు చేశారు.

2021-22లో అమ్మాపురంలో రూ.95,593 దుర్వినియోగానికి పాల్పడినట్లు గుర్తిం చగా, శ్మశాన వాటికలో సోలార్ లైటింగ్ సిస్టంకు టీఏ రూ.50,000 ఎంబీ రికార్డు చేసి బిల్లులు జత చేయడం జరిగింది. ఇలా జిల్లాలో టీఏ, ఈసీ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పనులు చేయని వారికి, స్థానికంగా ఉండని వారికి కూడా ఈజీఎస్ కూలీ డబ్బులు చెల్లించి, చేతివాటం ప్రదర్శించారు.

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని, రికవరీ చేస్తామంటూ మండలస్థాయిలో నిర్వహించిన ఓపెన్ ఫోరం లో డీఆర్డీఏ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా ఇంత వరకు నిధులు దుర్విని యోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుపోలేదు కదా.! కనీసం వారి నుంచి పూర్తిస్థాయిలో నిధులు రికవరి కూడా చేయలేదని కూలీలు ఆరోపిస్తున్నారు.

నోటీసులు ఇచ్చి రికవరీలు చేస్తున్నాం

మధుసూదన్‌రాజు, పీడీ

సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన అవకతవకలపై నోటీలు జారీ చేస్తున్నాం. ఇప్పటికే కొన్ని నిధులను రికవరీ చేశాం. అవకతకవలకు పాల్పడిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

నేడు, రేపు గ్రూప్-3 పరీక్షలు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు మూసివేయాలన్నారు. పరీక్ష సెంటర్ల వద్ద నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దన్నారు. ఎగ్జామ్స్ పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్నయ్య నేతృత్వంలో డీఎస్పీలు-2, సీఐలు-7, ఎస్సైలు-24, ఏఎస్సైలు- 21, హెడ్ కానిస్టేబుళ్లు- 21, కానిస్టేబుళ్లు -42, మహిళా కానిస్టేబుళ్లు -21, హోంగార్డులు-3, సాయుధ సిబ్బంది-16, మొత్తంగా 187 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.

ఎరువుల షాపులు తనిఖీ

నెల్లికుదురు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఎరువులు పురుగు మందుల షాపులను వ్యవసాయ అధికారులు ఏడీఏ శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. ఎరువుల షాపులలో రికార్డులను, ఎరువులను, పురుగు మందులను పరిశీలించారు. నెల్లికుదురులోని శ్రీరామ ఎరువుల దుకాణంలో రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడంతో ఎరువులు విక్రయించవద్దని డీలర్లకు ఆదేశాలు జారీ చేశారు. పీవోఎస్ మిషనద్వారానే ఎరువులు విక్రయించాలన్నారు. ఏవో, ఎస్‌కె యాస్మీన్ పాల్గొన్నారు.

ఠాణా ఏర్పాటు చేయాలి

ఇనుగుర్తి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పాటు చేసిన ఇనుగుర్తి మండలంలో పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఎంసీపీఐ జిల్లా నాయకులు మర్రిపెల్లి మొగిళి, జాటోత్ బిచ్యానాయక్ ప్రభుత్వాన్ని కోరారు. వారి వెంట పార్టీ నాయకులు ఇస్లావత్ పతాని, సపావత్ లింబా, నాగబెల్లి రఘు, బోళ్ల అబ్బయ్య, వీరునాయక్ ఉన్నారు.

క్రైం కార్నర్

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

నెల్లికుదురు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందుతాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన దుర్గాభవానితండా శివారు రామోజీతండాలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. రామోజీ తండాకు చెందిన గుగులోత్ దేవేందర్ (40) తన తండ్రి గుగులోత్ మంగ్యా వాటాకు ఇవ్వవలసిన బ్యాంక్ రుణమాఫీ డబ్బులు ఇవ్వడంలేదని మనస్తాపం చెంది, పురుగుల మందుతాగాడు. వెంటనే తండావాసులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు వివరించాడు.

విద్యుదాఘాతంతో ఒకరు..

పెద్దవంగర : విద్యుత్ సహాయంతో చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వడ్డెకొత్తపల్లిలో చోటు చేసుకుంది. శనివారం ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం. వడ్డెకొత్తపల్లి శివారులోని లచ్చిరాం తండాకు చెందిన గుగులోతు శ్రీను (43) వడ్డెకొత్తపల్లి గ్రామ శివారులోని పెద్ద చెరువు అలుగు కాలువ నీటిలో విద్యుత్ సహాయంతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు తీగలు ఎడమ చేతికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కన స్థానికులు అలుగు కాలువలో మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య గుగులోతు శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

పెద్దవంగర, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన దున్న సతీష్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఘట్‌కేసర్‌కు వెళ్తున్న క్రమంలో తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై మండల కేంద్రంలో కారు ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి, పెద్దవంగర నుంచి తొర్రూరు వైపు వెళుతున్న ట్రాక్టర్‌పైకి దూసుకెళ్ళడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న బొల్ల సాంబశివరావు, ట్రాక్టర్ డ్రైవర్ ముద్దరబోయిన రఘుపతి, కారు డ్రైవర్ దున్న సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

'వడ్ల కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి'

కేసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ కోరారు. మండలంలోని పెనుగొండలో ధన్నసరి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ తేమశాతం 17లోపు నాణ్యమైన ధాన్యం తీసుకువస్తే ప్పకుండా మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మర్రి రంగారావు, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, తహసీల్దార్ ఎర్రయ్య, ఏవో వెంకన్న పాల్గొన్నారు.

గూడూరు సనాతన శివాలయం అభివృద్ధికి కృషి

- మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గూడూరు సనాతన శివాలయం అభివృద్ధికి కృషి చేస్తానని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా గూడూరు మండల కేంద్రంలోని శివాలయంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన లక్షదీపోత్సవ వేడుకలను ప్రారంభించి శివపార్వతుల కల్యాణంలో పాల్గొని పల్లకి మోసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయుల కాలంలో నిర్మించిన గూడూరు సనాతన శివాలయం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.6 లక్షల నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అవసరంను బట్టి తనవంతుగా కూడ సాయం అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి స్వామి, శివాలయంచైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు యాకూబ్‌పాషా, అమరేందర్‌రెడ్డి, పెసరి శివ, కన్నబోయిన వెంకన్న, మండల మల్లేష్, యాదగిరి, హెచ్.శివ, మహేష్, కదీర్, కోరె కుమారస్వామి, గల్లా చంటి, చందులాల్ పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

- జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించే గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో టీజీపీఎస్సీ గ్రూప్-3 నిర్వహణపై శనివారం పరీక్ష కేంద్రాల ప్రత్యేకాధికారులు, చీఫ్ సూపరిండెంట్‌ంట్లు, రూట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరా, టాయిలెట్ సౌక ర్యం కల్పించాలని, ముఖ్యంగా అంగవైకల్యం ఉన్న అభ్యర్థులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో పరీక్ష రాసే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరం ఉన్న వారికి స్క్రైబ్‌లు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రూట్‌అధికారులు తమకు కేటాయించిన రూట్లలో పోలీస్ బందోబస్తుతో ప్రశ్నాపత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించాలన్నారు. ఎటు వంటి సమస్య ఎదురైనా వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. డిపార్ట్‌మెంట్ అధికారులు పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులు అనుమతించేందుకు కేవ లం ఐడెంటీటీ కోసం హాల్ టికెట్‌తో పాటు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు లేదా ఇతర ప్రభుత్వ ఆమోదిత ఏ గుర్తింపు కార్డును మాత్రమే సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ఒక్క అభ్యర్థి తమవెంట సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్, ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రంలో ఉన్న ఐడెంటికల్ అధికారులు బయోమెట్రిక్ పద్ధతిలో అటెండెన్స్ తీసుకోవాలని, ఆ సమయంలో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు జరిగే పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు లోకల్ హాలిడే ప్రకటించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, రీజినల్ కో-ఆర్డినేటర్ ఎ.బలరాంనాయక్, ఆర్డీవో కృష్ణవేణి, గ్రూప్-3 ప్రత్యేకాధికారులు, జిల్లా కలెక్టరేట్ సూపరిండెంట్లు భద్రకాళి, బాలకృష్ణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

సంక్షిప్త వార్తలు

'క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్యాబ్ డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారిందని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర క్యాబ్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ (టీఆర్‌సీపీటీయూ) జిల్లా అధ్యక్షుడు కన్నం నాగరాజు కోరారు. మహబూబాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర క్యాబ్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ నాలుగవ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించి క్యాబ్‌డ్రైవర్ల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.రమేష్, గాడిపెల్లి సతీష్, టౌన్ ప్రెసిడెంట్ షాజహాన్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కేసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజిలో శనివారం స్థానిక లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది పేద వృద్ధులకు క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ రేపూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ పాస్ట్ జడ్‌సీలు చిర్ర యాకాంతంగౌడ్, యర్రం శ్రీరాములు, కార్యదర్శి రావుల నవీన్‌రెడ్డి, లక్కాకుల సత్యనారాయణ, బెజ్జం ప్రేమ్‌కుమార్, పరాంకుశం శ్రీహరి, సట్ల శివభరత్, దాసరి అశోక్, మారం సమ్మిరెడ్డి, ముదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మదిపెద్ది వెంకటేశ్ పాల్గొన్నారు.

'నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలి'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇంటి స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వం స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ పోరాట ప్రాంతాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇళ్లు లేని వేలాది మంది నిరుపేదలు ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, చిరంజీవి, మల్లయ్య, రమేష్, సత్యం, వికాస్, విజయ్, శ్రీను, బాలాజీ పాల్గొన్నారు.

గ్రంథాలయ కిటికిలకు జాలి ఏర్పాటు

కురవి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కురవి జడ్పీ హెచ్ఎస్ గ్రంథాలయ భవన కిటికిలకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ షేక్.జానీ జాలీలు ఏర్పాటు చేయించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారో త్సవాల్లో భాగంగా కిటికిలు ఏర్పాటు చేయించినట్లు వెల్లడిం చారు. జాలీల ఏర్పాటుతో విద్యార్థులకు దోమలు, కోతుల బెడద తప్పుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వహీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గుమ్మడి మహేష్ కుటుంబానికి అండగా ఉంటాం'

గార్ల నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సీతంపేటలో దారుణ హత్యకు గురైన గుమ్మడి మహేష్ హత్యకు కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. శనివారం సీతంపేటలోనిలో గుమ్మడి మహేష్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులు ఓదార్చారు. అనంతరం ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేష్ కుటుంబానికి రూ 8.ల క్షలు వచ్చే విధంగా పోలీసులు కృషి చేయాలన్నారు. హత్య కేసును పోలీసు అధికారులు తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కుటుంబసభ్యులు బంధువులు హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుక వచ్చారు. ఎస్‌పీఎస్ కన్వేక్షన్‌అధినేత గోదాల అభిలాష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి,కాంగ్రెస్ నాయకులు గోదాల మోహన్ రెడ్డి, కొనకంచి రామకృష్ణ, వీర్యానాయక్, బీజేపీ యువజన మోర్చారాష్ట్ర కార్యదర్శి విమల్ కుమార్ జైన్, స్థానిక బీజేపీ నాయకుడు వీర్యానాయక్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి సన్నిధిలో పూజలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. స్థానిక దేవాలయంలో అయ్యప్పస్వాములు ఏర్పాటు చేసిన మహాఅన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ఎడ్ల రమేష్, ఎడ్ల వేణుమధవ్, గురుస్వాములు గద్దె రవి, మస్తాన్‌రెడ్డికొమ్మాకుల రాజేశ్వర్, బవిరిశెట్టి నాగేశ్వర్‌రావు, నిమ్మల శ్రీనివాస్, ముత్యం వెంకన్న పాల్గొన్నారు.

భూ మాఫియాదారులపై చర్య తీసుకోవాలి

గూడూరు : ఎస్సీ, ఎస్టీల భూములను కబ్జా చేసిన భూ మాఫియాదారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కత్తి వెంకన్న, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మచ్చర్ల శివారు తార్యాతండాలో జాటోతు హుస్సేన్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు పలుమార్లు దరఖాస్తులు ఇచ్చినప్పటికి ఫలితం లేదని చెప్పారు. ఇప్పటికైనా భూ కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్య తీసుకోవాలని చెప్పారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ

కేసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య సూచించారు. కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ ఇంటి నుంచి బయటకు వెళ్లేవారు తాళం చెవులను దర్వాజ పైభాగంలో, ఆ పరిసర ప్రాంతాల్లో దాచి వెళుతున్నారని, దొంగలు ఇది గమనించి చోరీకి పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. తాళం చెవులను తమవెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఇంటి తలుపులకు సెంట్రల్‌లాక్, డోర్‌కర్టెన్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ జి.మురళీధర్‌రాజ్ ఉన్నారు.

గిరిజన ప్రజాసంఘాల నిరసన

నెహ్రూసెంటర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ ఉద్యమనేత బిర్సాముండా అధికారిక జయంతి వేడుకలకు సామాజిక ప్రజా సంఘాలను పిలవకపోవడం అన్యాయమని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమానాయక్, గిరిజన సామాజిక చైతన్యవేదిక అధ్యక్షులు గుగులోతు కిషన్‌నాయక్ ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ ఎదుట శనివారం గిరిజన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బోడ రమేష్‌నాయక్, బానోత్ రాందాస్‌నాయక్, లకావత్ రాంచంద్రునాయక్, రాంబాబునాయక్, లక్ష్మీబాయి, శ్రీనివాస్‌నాయక్, రాంజీనాయక్, సంతోష్‌నాయక్, బుజ్జిబాయి పాల్గొన్నారు.

రోజు గంట గ్రంథాలయానికి కేటాయించాలి

- మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువకులు ప్రతి రోజు ఒకగంట గ్రంథాలయానికి కేటాయించి పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని సముపార్జించాలని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న,గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి.శ్రీలత, లైబ్రరీయన్ జి. విజేందర్, సీహెచ్.రవి, రుద్రారపు వీరేందర్, గౌడ నరేందర్, భూలక్ష్మి, అబ్బగాని భాస్కర్, నరేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సతీష్ ఆర్థిక సాయం

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం బ్రహ్మణపల్లికి చెందిన గుర్రం అజయ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బుడిగే సతీష్‌గౌడ్, బ్రహ్మణపల్లి కాంగ్రెస్ నాయకులు అజయ్ తండ్రి మల్లేష్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ పూనెం యాకయ్య, భూపతి శ్రీను, బొల్లి సారయ్య, జున్నూరు వెంకన్న, డొనికల కుమారస్వామి, కారింగుల శ్రీను, గడ్డం హరికృష్ణ, గోపగాని రవి, దారావత్ పీర్యా, దారావత్ దేవేందర్, దారావత్ రమేష్, పెనక రాజు, ఈసం గణేష్, బుర్ర అజయ్, పొదుగు మధు, పూనెం సాయి, చంద్రం పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉన్న అధిక ఫీజులను నియంత్రించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల రంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ ఇందిరాగాంధీ సెంటర్‌లో శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. రాంప్రసాద్, స్వామి, ప్రవీణ్, లింగస్వామి, రాజు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యవంతంగాజీవించాలని వైద్యఆరోగ్యశాఖ సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరాకాలనీ సబ్ సెంటర్‌ను శనివారం సందర్శించారు. సిగ్నల్ కాలనీ, ఇందిరానగర్ కాలనీలోని డ్రైనేజీ కాల్వలను పరిశీలించి బ్లీచింగ్ పౌడర్‌ను వేయించారు. అనంతరం సిగ్నల్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. ఎంఎల్‌హెచ్‌పీ నర్మద, ఆశాలు శారద, కళావతి, అంగన్‌వాడీ టీచర్ సరిత, ఆయా భద్రమ్మ పాల్గొన్నారు.

గడ్డి మందును నిషేధించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మనుషుల ప్రాణాలను, భూసారాన్ని హరించి వేస్తున్న గడ్డి మందును నిషేధించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు విజ్ఞప్తి జేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శంతన్‌రామారాజు మాట్లాడుతూ....కలుపు సంహారక సమ్మేళనం అయిన గడ్డి మందుతో రాష్ట్రంలో ప్రతి సంవత్సరం వందలాది మంది ప్రాణాలతో పాటు భూసారాన్ని దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద రైతులు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో క్షణికావేశానికి లోనై గడ్డిమందు తాగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. గడ్డి మందును నిషేధించి ప్రజలప్రాణాలను, భూసారాన్ని, పర్యావరణసమతుల్యతను కాపాడాలని కోరారు.

'విద్యార్థులను సంసిద్ధులను చేయాలి'

గూడూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 3వ తరగతి విద్యార్థుల సామార్థ్యాల పరీక్ష కోసం జాతీయ వ్యాప్తంగా నిర్వహించే నేషనల్ అచ్యూవ్‌మెంట్ సర్వే (నాస్) పరీక్షకు మహబూబాబాద్ జిల్లా నుంచి మంచి ఫలితాలు సాధించాలని విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంవో) ఆజాద్ అన్నారు. గూడూరు మండల కేంద్రం చంద్రుగూడెం ఎంపీపీఎస్ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి సామార్థ్యాలను పరీక్షించారు. నాస్ మాక్ టెస్ట్‌లను సరిగ్గా నిర్వహించి విద్యార్థుల సామార్థ్యాల రికార్డులను నిర్వహించాలని, వాటి ద్వార నాస్ సర్వేలో మంచి ఫలితాలు సాధిస్తారని చెప్పారు. హెచ్‌ఎం పగడయ్య, ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

గ్రామసభకు అధికారుల డుమ్మా

కురవి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సర్పంచులు లేని ప్రస్తుత కాలంలో గ్రామాల్లో అధికారులదే కీలక భూమిక... ఇటువంటి ప్రస్తుత తరుణంలో శనివారం జరగాల్సిన కురవి గ్రామ సభకు అధికారులు డుమ్మా కొట్టారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే గ్రామసభకు వివిధ పార్టీల నాయకులు ఎన్.రాజేందర్‌కుమార్, ఎర్ర నాగేశ్వర్‌రావు, బాదె నాగయ్యలు హాజరయ్యారు. అయితే కార్యదర్శి విజయలక్ష్మి జీపీలోనేఉండి సభకు హాజరు కాలేదని ఆరోపిస్తూ వివిధ పార్టీల నాయకులు గ్రామసభను బహిష్కరించి వెళ్లిపోయారు. ఈ విషయమై కార్యదర్శి విజయలక్ష్మిని వివరణ కోరగా సభ మధ్యాహ్నం 2 గంటలకు జరగాల్సి ఉందని, తాను భోజనం చేసి బయటకు వచ్చే సరికి ఆయా పార్టీల నాయకులు వెళ్లిపోయారని వివరణ ఇచ్చారు. తిరిగి సోమవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.

'పోడు రైతులందరికీ రుణాలివ్వాలి'

- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


మచ్చర్లలో బ్యాంకు మేనేజర్లు, ఉన్నతాధికారులతో సమావేశమైన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం జారీ చేసిన అటవీహక్కు పత్రాలున్నా గిరిజన పోడు రైతులందరికీ పంట రుణాలను బేషరతుగా ఇవ్వాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ బ్యాంకర్లను ఆదేశించారు. 'పోడు పట్టాలపై రుణాలకు కొర్రీలు' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంతో ఆయన స్పందించారు. ఈ మేరకు గూడూరు మండలం మచ్చర్ల తార్యాతండాలోని ఆయన కార్యాలయంలో జిల్లాల్లో అన్ని బ్యాంకుల మేనేజర్లు, ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాదిరిగానే హక్కుపత్రాలున్న గిరిజన రైతులకు కొర్రీలు విధించకుండా పంట రుణాలను ఇవ్వాలని ఆదేశించారు.

రంజిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

నెల్లికుదురు, నవంబరు 16 ఆంధ్రజ్యోతి : కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసం రంజిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు నెల్లికుదురులోని అమూల్య గార్డెన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ కార్యకర్తలు కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, బాలజీనాయక్, రావుల సతీష్, జెల్ల వెంకటేష్, ఇట్టె దేవేందర్‌రెడ్డి, సారంపెల్లి వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పులి వెంకన్న, మౌనేందర్, పెరమాండ్ల మురళీ, జాగిరి యాకసాయిలు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


కాసం రంజిత్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు